కవితా కౌముది

# నిద్రాదేవి

సునీల్ ఉగాది

అమ్మ ఒడికన్నా ముందు
నువ్వే పరిచయం.
బహుశా అందుకేనేమో,
మన మధ్య అన్యోన్యత...!

తింటూ నిద్రపోయే వాళ్ళం...
చదువుకుంటూ ,
పాఠం వింటూ,
ఆటలాడుతూ,
అంతెందుకు...
నిద్రలో కూడ నిద్రపోతున్న కలలే...!!

నువ్వెప్పుడు హలో అన్నా,
నే ఛలో అనే వాణ్ని.
నేనెప్పుడు పిలిచినా,
నువ్వు అలా నా కళ్ల మీద వాలిపోయేదానివి...!!

నీతో ఉంటే
భవ బంధాలు,
కష్టసుఖాలు,
గెలుపోటములు,
ఆ మాటకొస్తే...
నాకు నేనె గుర్తుండేది కాదు...!
అదే యోగ స్థితని
నాకావయసులో తెలియలేదు.

కాలక్రమేనా చెప్పుడు మాటలు విన్నాను.
నీతో ఉంటే భవిష్యత్తుండదన్నారు.
క్రమంగా నిన్ను దూరం పెట్టసాగాను.
వసతిగృహాల్లో చదువుకునే రోజుల్లో,
నీ మనసు ఎలా విరచాలో నేర్పడానికి
ప్రత్యేక తరగతులు నిర్వహించడం
నాకిప్పటకి గుర్తు..!!!

కాలచక్రం తిరిగింది.
పేరు వెనక తోకలు,
ఇనప్పెట్టెలో నాలుగు రాళ్ళు,
పోగయ్యాయి గాని,
నువ్వు పలకరించడం మానేసాక
అవేవి రుచించడం లేదు..!

చేతులు కాలాయి అని అర్థమైంది
ఇక చేసేదేం లేదు...!

కనీసం నా పిల్లలతోనైన
లక్ష్మీ సరస్వతుల పూజ కంటే ముందు
నిద్రాదేవి నోములు చేయించి
నీ కటాక్షం జీవితకాలం ఉండేలా
చూసుకుంటా...!!!

★★★

## దిగులు మేఘం
## రవిప్రసాద్ చెలమల్లు

గుదిగుచ్చిన అక్షరాల వెంట
చూపులు పరిగెత్తుతూ ఉంటే
ఏ సవ్వడి లేకుండానే
భావాలతో మనసు నిండుతుంది

ఆత్మీయ స్పర్శ మాట్లాడదు
బంధానికి భరోసా మట్టుకు
మనసుకు చేరుతుంది

నిశ్శబ్దంగా విరిసిన విరులు
తావిగా మారి గాలిలో తేలి
మది తలుపు తడతాయి

మౌనంగా పుడమి ఒడిలో
తలదాచుకున్న తొలిచినుకుల సడి
పరిమళమై మనసుకు తెలుస్తుంది

కనిపించని దిగులు మేఘాల వెనుక
పలుచన అవుతున్న మనిషితనం వెనుక
అర్థం కాని మౌనం ఏదో దాగి ఉంటుంది
తర్జుమా చేయడానికి ఓ సరితోడు  కావాలి

★★★★

## ఎండమావి
## కృష్ణ కొండూరు

మంచె మీద మంచితనం
ఎంతపిల్చినా నోరువిప్పలేదు

ఆహుతవుతున్న చల్లదనానికి
తూట్లు పడ్డ కుండ తోడురాలేదు

కాల్చొచ్చిన చేతులు
తర్పణాలకి సేదతీరడంలేదు

వర్తమానాన్ని ఓ శోకం
గతమవమని శపించింది
తానే వర్తమానమంటూ శాశించింది

ఆకలి, దప్పిక, నిద్ర గుర్తురావడంలేదు
అలాగే అంతా మర్చి పోతే
బాగుండనిపిస్తుంది

నిజం నమ్మబుద్ధవడంలేదు
అబద్ధం నిజమవబోదు

చెప్పినంత సులువుకాదు

వేదాంతాలు సిద్ధాంతాలు
అన్నీ అక్కరకు రాని ఎండమావులే

★★★

# సంధ్యాకాశ్మీరం

భరద్వాజ్ గొడవర్తి

ఆ నేల విలపించింది -
తన రంగు మళ్లీ ఎర్రగా మారినందుకు,
తన గుండెపై మళ్లీ నడిచే శవాలను మోసినందుకు..!
ఆ నేల విలపించింది -
తన ఆడబిడ్డ నుదిటిన కుంకుమను తుడిచేసి,
రక్తపు తిలకం దిద్దినందుకు..!
ఆ నేల విలపించింది -
ఊపిరి బిగబట్టి తనను చూడటానికి వచ్చిన అతిథుల ఊపిరి,
తుపాకీ తూటాల తాకిడికి అక్కడే ఆఖరి సారి
ఆగిపోయినందుకు..!
ఆ నేల విలపించింది -
తూటాల శబ్దాల ప్రతిధ్వనిని,
నిశ్శబ్దంగా తనపై పడుతున్న జీవితపు మరకలను
మోయాల్సినందుకు..!
ఆ నేల విలపించింది -
తనను కెమెరాలో బంధించి, జ్ఞాపకాలని
తీసుకెళ్లదామనుకున్న వారు,
తామే జ్ఞాపకాలై మిగిలిపోయి,
జీవం ఉన్న ఫోన్లో జీవంలేని బొమ్మగా మిగిలిపోయినందుకు..!
ఆ నేల విలపించింది -
బెదురుగా తుపాకీ వెనక నిలబడి,
నిశ్చింతగా స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్న
మనుషులపై దాడి చేసిన దురాగతాన్ని మోసినందుకు…!
ఆ నేల సహనం కోల్పోయి -
అమ్మవారి అవతారం ఎత్తక మానదు,
అసురవధ జరగక మానదు…!!

★★★

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

పంజరమున పులుగు మనోభావమేమి?
కనుల వీక్షించుచుండు లోకమును తాను
ఎల్లలను దాట మది పరువెత్తుచుండు
ఎచటికేగగజాలదు గృహము వీడి

లోకమునుగూర్చి తనమదిలోన తలచు
తనివి తీరగ కనునదింతయును లేదు
మనసు మాత్రము భువియెల్ల కనగ జాలు
పక్షములు దాటజాలవు పంజరమును

ఎవరినో పిల్చుచుండెలుగెత్తి సతము
బదులు పల్కజాలరు తన బంధుజనము
ఉలుకు పలుకు లేకనె యుండునొక్క మారు
దిక్కులెల్లను విననేడ్చునొక్క మారు

కాంచుచుండు మిత్రుల గవాక్షమ్మునుండి
వినును వాని కూజితముల ప్రియము మీర
వాని గళమునందానందవార్ధి చెలగు
అనయమాపగలేని రోదనము తనది

ఆకసమ్మున సాగు మేఘాళి వోలె
ఎగురజూచును గాని తానెగురలేదు
కాంచి మేఘముల్ గూడ రోదించుచుండు
తన విముక్తిని కోరి బంధనమునుండి

COMMENTS